

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY - 2015**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చర్‌షిప్
# సత్యవాణి-క్రీస్తుసంఘము

స్థలము: క్రీస్తుసంఘము,
7-9-35 సాంబమూర్తివీధి,సత్యవాణి,కాకినాడ.

తేదీలు: 2015 నవంబరు 3,4,5,6 తేదీలలో
మంగళ,బుధ,గురు,శుక్రవారములు

సమయం: ఉదయం 10:00 గం॥లకు
మధ్యాహ్నం 2:00 గం॥లకు
సాయంత్రం 7:00 గం॥లకు

ప్రసంగీకులు: బ్రదర్.జిమ్ కెల్లీ,యు.ఎస్.ఏ
బ్రదర్.రోజర్ రైట్,యు.ఎస్.ఏ
బ్రదర్.లూయిస్ రష్‌మోర్,యు.ఎస్.ఏ
మరియు స్వదేశ సువార్తికులు

మీరు సకుటుంబ సపరివారముగా , మీ స్థానిక సంఘముతో కలిసి రండి.భోజన వసతులు ఉచితం.మొదటి రోజున 20 రూపాయులు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను.అందరికి స్వాగతం.

బ్రదర్.జాషువా గూటం
బ్రదర్.రిక్కీ గూటం
0884-2363722; 9848 998547.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 35 | జూలై - 2015 | సంచిక - 12


## యేసు చేసిన బోధనలు -1
(Jesus and His Teachings)

యేసుక్రీస్తు ప్రజలకు ఉపమానముల ద్వారాను అధికారముతోను అనేకరీతులుగ ఆధ్యాత్మిక సంగతులను బోధించెనని గత సంచికలో మనము తెలుసుకొనియుంటిమి. నిజానికి ఈ భూమిపై ఉద్భవించిన వారిలో యేసు క్రీస్తు వంటి గొప్ప బోధకుడు ఎవడును లేడు. యేసు తననోటిమాట ద్వారాను. తన జీవిత మాదిరి ద్వారాను తనను వెంబడించు శిష్యులు ఎట్లుండవలెనో చక్కగా బోధించెను. వచ్చే కొద్ది పాఠములలో యేసు చేసిన ఈ గొప్ప బోధనలను గూర్చి తెలుసుకొందము, తెలుసుకొనుటయేగాక ఆయన మాటలననుసరించుటకు ప్రయత్నించెదము.

యేసు యొక్క బాల్యదశలో జరిగిన ఒక ప్రాముఖ్య సంగతిని గూర్చి లూకా ఒక్కడు మాత్రమే లూకా సువార్త 2: 41-50లో వ్రాసెను. యేసు పండ్రెండేండ్లవాడై యున్నప్పుడు పస్కాపండుగ నాచరించుటకై తన తల్లిదండ్రులతో కూడా యెరూషలేమునకు వెళ్లెను. యెరూషలేమునకు వెళ్ళక ముందే "బాలుడు జ్ఞానముతో నిండుకొనుచు ఎదిగి బలము పొందుచుండెను; దేవుని దయ ఆయన మీద నుండెను" అని లూకా

2:40లో వ్రాయబడియున్నది.

పస్కాదినములు తీరిన తరువాత యేసు యొక్క తల్లిదండ్రులు యెరూషలేము నుండి తిరిగి వెళ్ళిపోయిరి, గాని ఆయన యెరూషలేములో నిలిచెను. దీనిని బట్టి ఆధ్యాత్మిక విషయాల్లో ఆయనకున్న ఆసక్తిని బాల్యదశలోనే ఆయన బయలు పరచెను. మూడు దినములైన తరువాత యేసు తల్లిదండ్రులు "ఆయన దేవాలయ ములో బోధకుల మధ్య కూర్చుండి, వారి మాటలను ఆలకించుచు, వారిని ప్రశ్నల డుగుచు ఉండగా చూచిరి". దీనినిబట్టి ఆయన జాగ్రత్తగా ఆలకించువ డని, ఆత్మీయ సంగతులను తెలుసుకొనుటలో గొప్ప ఆసక్తి కలవాడని బాల్యదశలోనే ఋజువుపరచెను. యేసువలె యౌవన స్థులు తమ బాల్య దినములలోనే దేవుని గూర్చి వినుటకును, తెలుసుకొనుటకును ఆసక్తి కలిగియుండుట మంచిది. వారికి దేవుని గూర్చి బోధించు బాధ్యత తల్లి దండ్రులదే: "బాలుడు నడువవలసిన త్రోవను వానికినేర్పుము వాడు పెద్దవాడై నప్పుడును దాని నుండి తొలగిపోడు" అని దైవవేదము బోధించుచున్నది (సామె 22:6). "దుర్దినములు రాకముందే నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" అని పరిశుద్ధాత్ముడు జ్ఞానియైన సొలొమోను ద్వారా పలుకు చున్నాడు (ప్రసంగి 12:1-2). యేసు క్రీస్తు బాల్యదినములయందే దైవచింతన కలిగి జీవించెను. నేటి మన బాల బాలికలకు దేవుని గూర్చిన సత్యమును బోధించు బాధ్యత మనపై మరింత యెక్కువ ఉ న్నదని గమనింతము. యేసు చిన్న వయసులోనే యెరూషలేము దేవాలయములోని బోధకులను ప్రశ్నల డుగుచుండగా "ఆయన మాటలు వినిన వారందరు ఆయన ప్రజ్ఞకును, ప్రత్యుత్తర ములకును విస్మయమొందిరి. ఆయన తలిదండ్రులు ఆయనను చూచి మిక్కిలి ఆశ్చర్యపడిరి, నీవు మాతో కూడా రాకుండా యెరూషలేములోనే ఎందుకు ఉండిపోతివి? అని ఆయన తల్లి ఆయన నడుగగా, "నేను నా తండ్రి పనులమీద నుండ వలెనని మీరెరుగరా?" అని ఆయన వారితో చెప్పి పరలోక తండ్రియైన దేవుడాయనకిచ్చిన పనిని నిర్వర్తించే బాధ్యతను అప్పటికే గ్రహించియుండెనని యేసు బయలుపరచెను. అయినను, పరలోకపు తండ్రికే కాదు, ఇహలోక తల్లిదండ్రుల యెడల కూడా బాధ్యత గలవాడనని యేసు ఋజువుపరచెను. "అంతట ఆయన వారితో కూడా బయలుదేరి నజరేతునకువచ్చి వారికి లోబడియుండెను. యేసు దేవుని కుమారుడే అయినను ఇహలోక తల్లి దండ్రులకులోబడి గొప్పమాదిరిని మనకనుగ్రహించెను. పిల్లలు తమ

తల్లిదండ్రులకు లోబడి యుండుట వారికి గొప్ప ఆశీర్వాదము. "పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే" అని ఎఫెసీ 6:1లో వ్రాయబడి యున్నది. "నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించుదేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీతండ్రిని నీతల్లిని సన్మానింపుము" అను వాగ్దానముతో కూడిన మొదటి ఆజ్ఞ నిర్గమ 20:12లో వ్రాయబడియున్నది.

బాల్యదశ నుండి యౌవనస్థునిగా యేసు పెరిగిన కాలమంతటిని భక్తుడైన లూకా గొప్ప భావముతో కూడిన నాలుగు మాటలలో మనకు వర్ణించెను. యేసు జ్ఞానమందును (అంటే మానసికముగాను, వయస్సునందును (అంటే శారీరకముగాను), దేవుని దయ యందును (అంటే ఆత్మీయముగాను), మనుష్యుల దయయందును (అంటే సాంఘికముగాను) వర్ధిల్లుచుండెను అని అతడు వ్రాసెను (లూకా 2:52). ప్రతి మానవుడు ఈ నాలుగు విషయాల్లో అనగా మానసికముగాను, శారీరకముగాను, ఆత్మీయముగాను, సాంఘికముగాను అభివృద్ధిని క్రీస్తువలె కనబరచవలెనని యేసు తన జీవిత విధానము ద్వారా గొప్ప పాఠమును మనకు బోధించుచున్నారు. మానవులట్లు అభివృద్ధి చెందగలిగిన యెడల పరిపూర్ణతను సాధించగలరు.

పాపము లేనివాడైనను యేసు బాప్తిస్మము పొందెను. బాప్తిస్మము పొందుటకు అయన యొర్దాను దగ్గరనున్న యోహాను యొద్దకు వచ్చెను". అందుకు యోహాను -నేను నీచేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా అని ఆయనను నివారింపజూచెను గాని యేసు - ఇప్పటికికానిమ్ము నీతియావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తర మిచ్చెను - గనుక అతడాలాగుకానిచ్చెను" (మత్తయి 3: 13-15).

మనమయితే పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందలెను గాని ఏపాపము లేని యేసు ఎందుకు బాప్తిస్మము పొందెను? అని కొందరు అడుగుదురు. ఇక్కడ యేసు చెప్పిన మాటలలోనే దానికి జవాబున్నది. ఆయన నీతి యావత్తును నెరవేర్చుటకు బాప్తిస్మముపొందెను. మరల, నీతి అనగా యేమిటి? అనే ప్రశ్న మనకు రావచ్చును. దేవుని ఆజ్ఞలన్నియు నీతియని లేక న్యాయములని కీర్తనలు 119:172లో వ్రాయబడి యున్నది. గనుక యేసు దేవుని ఆజ్ఞలను నెరవేర్చు నిమిత్తము

బాప్తిస్మము పొందెనని మనము ఇంకొక మాటలో చెప్పుకొనవచ్చును. దేవుని నీతి యావత్తును నెరవేర్చుటకు దేవుని కుమారుడైన క్రీస్తే బాప్తిస్మము పొంద వలసి వచ్చిన యెడల మానవులమైన మనము పాపక్ష మాపణ నిమిత్తము బాప్తిస్మము పొంద వలసిన అగత్యత మరింత యెక్కువయున్నది. అందుకే "మీరు మారుమనస్సు పొంది పాపక్ష మాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని అపొ.కా. 2:38 మనలను ఆజ్ఞాపించుచున్నది.

యేసు బాప్తిస్మము పొంది ప్రార్థన చేసెను. ఇదంతయు చూచి దేవుడు తన సంతోషమును ప్రకటించెను. "యేసు ప్రార్థన చేయుచుండగా ఆకాశము తెరువబడి, పరిశుద్ధాత్మ శరీరాకారముతో పావురమువలె ఆయన మీదికి దిగి వచ్చెను. అప్పుడు - నీవు నాప్రియ కుమారుడవు, నీయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (లూకా 3:21-22).

శోధనను ఎదుర్కొనుటకును, జయించుటకును యేసు దేవుని వాక్యమును ఉపయోగించెను. యేసు ఆకలి గొనగా శోధకుడు నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్ళు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను. అందుకాయన మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదుగాని దేవుని నోటినుండి వచ్చు ప్రతిమాట వలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను. మరల అపవాది ఆయనను దేవాలయ శిఖరమున నిలువబెట్టి నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము అని శోధించెను. అందుకు యేసు ప్రభువైన నీ దేవుని శోధింపవలదని మరియొక చోట వ్రాయబడి యున్నదని వానితో చెప్పెను. మరల అపవాది, నీవు నాకు సాగిలపడి నమస్కారము చేసిన యెడల ఈలోక రాజ్యములన్నిటిని, వాటి మహిమను నీకిచ్చెదనని ఆయనతో చెప్పెను అందుకు యేసు - సాతానా, పొమ్ము, ప్రభువైన నీదేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడి యున్నదనెను (మత్తయి 4:1-10). ఈ సందర్భములో యేసు లేఖనముల నెత్తిచూపించి అపవాదిని జయించుట మనము గ్రహించగలము. "కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్ద నుండి పారిపోవును" అని యాకోబు 4:7లో వ్రాయబడియున్నది. మనము దేవుని వాక్యమును ఎంత ఎక్కువ తెలుసు కొనగలిగితే అంత ఎక్కువ అపవాది మననుండి పారిపోవును.

యేసు తన బాల్యదశ నుండియే

తన జీవితము ద్వారా మంచి పాఠము లను నేర్పించినట్లు మనము గ్రహిం చాము. వచ్చే పాఠములో ఆయన నేర్పిం చిన పాఠములను మరికొన్ని తెలుసు కొందము. ఈలోగా మీరు దేవునియొద్దకు రండి క్రీస్తు దేవుని కుమారుడని నమ్మండి. పాపములను విసర్జించండి. బాప్తిస్మము పొందండి. అప్పుడాయన మీ యొద్దకు వచ్చును.

## సమాధానబలి
## (The Peace offering)

**దేవుని బల్యర్పణ పద్ధతి - 10**

ఈ పాఠములో లేవీయకాండము 3వ అధ్యాయములో వర్ణించబడిన సమాధాన బలిని గూర్చి తెలిసికొనబోవుచున్నాము. సువాసనగల యర్పణలలో యిది మూడవది. అది ఆరాధన సంబంధమైన అర్పణయై యున్నది. దేవునితో సత్సంబంధముగల వాడు ఈ యర్పణను అర్పించేవాడు. దీనిలోయున్న ప్రత్యేకతలను గమనించుదాము, మరియు బలియర్పించబడిన పశువు విషయంలో ఈ యర్పణలో కొంతా తేడాకన్పడును.

ఈ సమాధానబలి లేక సహవాస యర్పణను దేవునికి మానవునికి మధ్య యున్న సహవాసమును పండుగ వాతావరణములో జరిగించబడుట మనము గమనించవచ్చును. మోషేధర్మ శాస్త్రమంతటిలోను యిది అత్యంత ఆనందదాయకమైన అర్పణయైయున్నది. ఏలయనగా దేవునికి మానవునికి, మానవు నికి మానవునిక్, మానవుడు తనలో తానును కలిగియున్న శాంతియుత సంబంధమును ప్రకటించు గొప్ప సంతోషదాయక అర్పణయిది.

**షెలెము లేక షెలామీకు:**

ఈ సమాధాన బలి యొక్క పేరు హెబ్రీ భాషలో షెలెము అనబడెను. అది షాలోము అను పదమునుండి ఉద్భవించినది. షాలోము అనగా శాంతి లేక, సమాధానము అని యర్థము. నేటికిని హెబ్రీయులు ఆపదమును ఒకరినొకరు పలకరించుటకుపయోగింతురు. ఈ సమాధాన బలికి హెబ్రీయులు షెలెము అను పదమునుపయోగింతురు. షెలెము అనగా లోటుగా యున్నదానిని పూరించుటయని యర్థము. హెబ్రీయుడు పాపము వలన దేవుని నుండి తొలగిపోగా, అతడు మరల ఆయనతో సత్సంబంధము నెలకొల్పుకొనుటకు ఈయర్పణ సహాయపడును.

**పునరుద్ధరణ మార్గము :**

అతిక్రమము వలన తొలగి పోయిన వాడు, మారుమనస్సు పొంది

పోయిన వాడు, మారుమనస్సు పొంది దేవునితో తన సహవాసము పునరుద్ధరింప బడగోరుచున్న యెడల మొదటిగా అతడు పాపయాగమును లేక అతిక్రమయాగమును చేయవలసియున్నది. అతడు దేవునితో సత్సంబంధము లేకయున్నప్పుడు సమాధాన బలియర్పించుట తగదు. ఒకడు దేవుని సన్నిధిలో సరిగ్గా లేనప్పుడు సమాధాన బలియర్పించుట హేయము, గనుక అట్టివాడు మొదట అర్పించవలసినది దహనబలి కాదు, సమాధానబలి కాదు గాని పాపపరిహారార్ధబలి అర్పించవలెను. సహవాసము పునర్ధురించబడితే మానవునికి దేవునికి మధ్య పండుగ వాతావణము: యేర్పడును. గనుక ఈ పండుగలో పాలుపుచ్చుకొనక ముందు శాంతియుత సంబంధములు పునరుద్ధరింపబడవలెను.

మోషే ధర్మశాస్త్రప్రకారము దేవునితో నిబంధన సంబంధము లేని వాడెవడును ఈ సమాధానబలిని అర్పించ కూడదు. దేవునితో నిబంధన సంబంధము లేని వాని యొద్దనుండి ఇశ్రాయేలీయుడు ఒక పశువును కూడ బలియర్పించుట కొరకు తీసికొన కూడదు, ఈ యర్పణనర్పించు వాడు దేవునితో సహవాసము కలిగియుండవలెను. గనుక దేవునితో పునరుద్ధరింపబడుట ఈ యర్పణ యొక్క ముఖ్య ఉద్దేశ్యమై యున్నది.

పాపపరిహారము జరిగే వరకు యూదుడెవడును సమాధాన బలిలో పాలు పొంగలేదు. లేవీ 7:18-21 ను బట్టి దేవుని నుండి వేరైన వాడెవడును ఈ సమాధాన బలి యర్పించుతరుణము కలిగినవాడుకాడు.

**మూడు రకములైన సమాధానబలి :**

సమాధాన బలి మూడు విధములుగా విభజింపబడియున్నది. మొదటిది కృతజ్ఞత బలి. హెబ్రీ భాషలో అది horah అని పిలువబడినది, దానిలో "హల్లెలూయ! ప్రభువుకు కృతజ్ఞతలు" అను భావము ఇమిడియున్నది లేవీ 22:29లో అది కృతజ్ఞతాబలియని చెప్పబడినది. కృతజ్ఞతాబలిగా అర్పింపబడిన పశువును ఆదినమందే తినవలెను. దానిలోనిది ఏదియు మరునాటికి ఉంచుకొనకూడదు (లేవీ 7:15). అర్పింపబడునది సహజముగా మచ్చలేనిదై యుండవలెను.

సమాధానబలిలో రెండవరకము మ్రొక్కు బడిని చెల్లించుటకొరకు చేయునట్టిది (లేవీ 22:21). ఇందులో అర్పింపబడినది మరునాడైనను దానిని తినవచ్చును. మూడవనాటికి మిగిలి యున్నదానినంతటిని అగ్నితో కాల్చివేయవలెను (లేవీ 19:5-6).

సమాధాన బలిలో మూడవది

భాషలో Nidebah అని యందురు. దీనిని కూడ రెండవనాడు భుజింప వచ్చును.

**సమాధానబలి సంస్కారము :**

సమాధానబలి సంస్కారము మొదటిదశలో దహనబలి మాదిరి. కొంత మట్టుకు మనకు కనబడును. బలిపశువును సమర్పించుట, దానిపై చేతులుంచుట, దానిని వధించుట, దాని రక్తమును ప్రోక్షించుట మొదలగునవి. గాని అప్పటి నుండి ఈ బలిలో కొన్ని ప్రత్యేకతలు అగుపడును.

మొదటిదశ సమర్పణ దహన బలిలో హెబ్రీయుడు తన్నుతాను ప్రతిష్ఠించుకొనుచు దేవునికి సమర్పించుకొనును. గాని సమాధాన బలిలో ఈ సమర్పణ దేవునితో సంతోషదాయకమైన సంబంధమును గూర్చియు, ఆయనతోపండుగ వాతావరణములో విందులోపాలు పొందుటయును ఇమిడి యున్నవి. ఇక్కడ అతడు దేవునితోలోతైన సహవాసమును కోరుచున్నాడు. తనకు దేవునికి మధ్య నున్న ఆత్మీయ ఐక్యతను మరింత అభివృద్ధి చేయతలంచుకొనును.

రెండవదశలో ఆరాధించేవాడు తన చేతిని బలిపశువు తలమీద ఉంచును. అతడు సాదృశ్యముగా ఆపశువుపై అతడు సంపూర్తిగా ఆధారపడును, ఆ పశువుపై తన చేతిని ఉంచి ఆరాధకుడు తన పాపములను సారూప్యముగా ఆ బలిపశువుకు తరలించును, ఆ పశువు తనము బదులుగా అర్పించబడును.

**పశువును వధించుట :**

మూడవదశలో సమాధాన బలి పశువును వధించుట జరుగును. దహన బలివలె ఇక్కడ కూడ యున్న ప్రయోజనము ఒక్కటే. ఆరాధకుడు తన పాపములను బలిపశువుకు బదిలిచేసిన తరువాత తాను తెచ్చిన పశువును తానేవధించవలెను. అట్లు చేసి తన పాపముల యెడల దేవుని తీర్పును అంగీకరించును. అందు వలన అతడు వ్యక్తిగతముగా ధర్మ శాస్త్రము విధించు శిక్షను పరోక్షముగా భరించును. అతడు వధించిన పశువు మరణ భాదతో గిజగిజలాడుచుండగా పాపము యెడల దేవుని చట్టము యొక్క శిక్షను తప్పక అనుభవించును.

**రక్తప్రోక్షణ :**

బలియర్పింపబడిన జంతువు యొక్క రక్తమును యాజకుడు బలి పీఠము చుట్టు ప్రోక్షించును. రక్తము దహన బలిపీఠము దిగువ ప్రోక్షింపబడును. పాపపరిహారార్థముగా రక్తము అట్లు ప్రోక్షింపబడును. మిగతా అన్ని బలులవలె ఆరాధకుడు క్షమాపణ పొందునట్లు యాజకులపై ఆధారపడును.

**బలిదశలో మార్పు:**

ఇప్పుడు సమాధానబలి యొక్క ఐదవ దశమను గమనించుదము, దహన బలికి వేరుగా యున్న మొదటి దశ ఇక్కడ మనకు కనపడును. దీనిలో జంతువు యొక్క క్రొవ్వు అంతయు తీసివేయబడును. దాని శరీరములోని క్రొవ్వును మడ్డిపూస మొదలుకొని క్రొవ్వినతోక అంతటిని, అంత్రములలోనిక్రొవ్వును యెహోవాకు హోమము చేయవలెను.

**యెహోవాకు హోమరూపమైన ఆహారము :**

సమాధానబలిలోని క్రొవ్వు యెహోవాకు హోమ రూపమైన ఆహారమని చెప్పబడెను. దీనిని బట్టి ఆరాధించేవాడు మాత్రమే గాక దేవుడు కూడ ఈ విందురూపమైన యర్పణలో పాలుపొందును. లేవీకాండము 3:11, 16;21:6,8,17లలో ఈక్రొవ్వు యెహోవాకు ఆహారమని చెప్పబడెను. గనుక యిది దేవుకిని, ఆరాధకునికిని మధ్య జరిగిన విందు. వీరిద్దరి మధ్య ఏర్పడిన సమాధానమును పండుగ వాతావరణములో ఇవ్విధముగా చక్కగా చిత్రీకరించబడినది, ఇశ్రాయేలీయుడు పాపమునుండి తొలగి దేవుని యొద్దకు తిరిగి వచ్చిన యెడల దేవుడు ఆనందించును.

"క్రొవ్వు అంతయు యెహోవాదే, అది సువాసనగల హోమరూపమైన ఆహారము. మీరు క్రొవ్వునైనను రక్తము నైనను తినకూడదు. అది మీతర తరములకు మీ నివాసస్థలములన్నిటి లోను నిత్యమైనకట్టడ" యని దేవుడు ఇశ్రాయేలీయులను హెచ్చరించెను (లేవీ 3:16-17). బలిపశువు యొక్క శరీరమునుండి తీసివేయబడిన క్రొవ్వంతయు బలిపీఠము మీద యెహోవాకు హోమముగా దహించబడవలెను. అది ఆయనకు ఇంపైనసువాసన, బలిగా అర్పించబడిన క్రొవ్వును ఎవడును తీసి కొనకూడదు. 1 సమూయేలు 2:15-17లో ఏలీ కుమారులు యెహోవాకు చెందిన క్రొవ్వులో భాగమును తమ కొరకు బలవంతముగాలాగు కొనుట వలన అపరాధులైరి. వారియొక్క దుర్మార్గతను ఏలీ ఎరిగినవాడైనను వారిని అదుపు చేయలేకపోయెను. అందువలన ఏలీ యొక్క కుంటుంబ మును యాజకులుగా నుండుటకు దేవుడు నిరాకరించెను. వారినిహత మార్చెను (1 సమూ 2 : 22- 25). వారు చేసిన పాపము యిది : దేవునికి చెందవలసిన దానిని తాము పొంద గోరిరి. అది యెహోవాకు హేయము. దేవునికి చెందవలసిన ఘనతను, మహిమను, ఆరాధనను మానవుడు నిర్లక్ష్యము చేసిన యెడల అతడు దేవుని

యొద్ద దొంగిలుచున్నాడు (మలాకీ 3:8).

**భాగములు విడదీయుట:**

ఆరవ దశలో బలియర్పింపబడిన జంతువు విడదీయబడి బలిలో పాలుపొందు వారికి కొంత ఇయ్యబడును. మొదటిగా దాని బోరవిడదీయబడును. లేవీ 7:31,34,36ను బట్టి అది ప్రధానయాజకునికి ఇయ్యబడును. దీనిని బట్టి దేవుడు యాజకుని సంరక్షణకు ఇట్టిసంకల్పము నిచ్చెనని గ్రహించవచ్చును, ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన దేశములో లేవీయులకు ఆయన స్వాస్థ్యమేమీ ఇయ్యలేదు. "యాజకులైన లేవీయులకు అనగా లేవీ గోత్రీయులకందరికిని ఇశ్రాయేలీయులతో పాలైనను స్వాస్థ్యమైనను ఉండదు; వారు యెహోవా హోమ ద్రవ్యములను తిందురు. అది వారి హక్కు" అని ద్వితీ 18:1-2లో చెప్పబడినది. (1 కొరింథీ 9:13 ను కూడ చదువండి).

వారు బోరను అల్లాడించిన తరువాత జంతువుయొక్క కుడిజబ్బను తీసికొని ఆరాధకుడు దానిపై చేతులుంచగా యాజకుడు కూడ తన చేతులుంచి దానిని అల్లాడింతురు. మూడుసార్లు అల్లాడించిన తరువాత దానిని యాజకుడు తన భాగముగా యింటికి తీసికొని వెళ్లును. దేవుడే ఈ రీతిగా యాజకుని పోషించును. ఆయన ధర్మశాస్త్రముననుసరించి జీవించువానిని తప్పక పోషించును.

**దేవుని పండుగ విందు :**

సమాధానబలిలోని తదుపరి దశలో ఆజంతువును ఆరాధకుడు దేవునికర్పించును. దాని మాంసమును ఆరాధించువాడు, తనభార్య, బిడ్డలు, పనివారితో సహా తన యింటిలోనున్న వారందరితోను కలసి భుజించును. యిది కుటుంబపరమైన వ్యవహారమని ద్వితీ 12:17-16:11 తెలియజేయుచున్నది.

దేవునితో తనకుగల సంబంధము కోల్పోవునంతగా ఒకడు పాపము చేసిన యెడల అది తనకు, తనకుటుంబానికి మధ్య ఎడబాటు కలుగజేయును. అతడు మారుమనస్సుపొంది దేవునితో సమాధానమును ఇప్పుడు అనుభవింపవచ్చును. ఆ మనుష్యుడును తన కుటుంబమును ప్రత్యక్షగుడారము యొక్క ఆవరణములో దాని తినవచ్చును. వారు ఆనందముతో దానినారబింతురు.

**ప్రాముఖ్య పాఠములు :**

సమాధాన బలి నుండి మనము కొన్ని ప్రాముఖ్యపాఠములను నేర్చుకొనవచ్చును. అనేక కోణముల నుండి

కొనవచ్చును. అనేక కోణముల నుండి సమాధానము మనము వీక్షింప వచ్చును.దేవునితో సమాధానము,కుటుంబ ముతో ఇశ్రాయేలు సహపేరులతో సమాధానము, మరి ముఖ్యముగా తనలో తనకు సమాధానము. ఈ విందు జరిగే ప్రదేశము, దేవుని మందిర ఆవరణ నుండి, మరొకపాఠము అనగా అది దేవుని సముఖమునందు జరుగువిందు. ఒకడు రాజుయొక్క విందుకు ఆహ్వానించబడితే, రాజు అతడుకూడ సత్సంబంధము కలిగియున్న వారగుదురు.మరల ఈ సహవాసమునకుటుంబ సపరివారముతో నీవు, నీకుమారుడు నీకుమార్తె, నీ దాసుడు, నీదాసి, నీయింటనుండు లేవీయులు కలిసికొని నీ దేవుడైన యెహోవా సన్నిధిని తిని, నీవు చేయు ప్రయత్నములన్నిటిలో నీ దేవుడైన యెహోవా సన్నిధిని సంతోషించు దువు" అని ఆయన చెప్పెను (ద్వితీ 12:18). విందు యిచ్చువాడు దేవుడు, ఆరాధించువాడు అతిథి. అది ఆయన ఆవరణములో జరుగును. అక్కడ ఆయన తన సహవాసము ననుగ్రహించును. మరియు అక్కడనే దేవునికి మానవుని మధ్య భావ యుక్తమైన సంబంధమేర్పడును.

## దేవుడు పాపులను ప్రేమించును
## (God Loves Sinners)

దేవుడు పాపులందరినీ ప్రేమించునా? ఆయన ప్రేమించని ఏ పాపినైనను ద్వేషించరు, లేదా పాపమును ద్వేషించును గాని పాపిని కాదు అను మాటలు తరుచు మనం వింటాము. అది సత్యమని బైబిలు బోధయని అంగీకరింతుము. నరకములోనికి పంపే పాపులను కూడ దేవుడు ప్రేమించునని ఒకాయన చెప్పారు.

**ఒక హెచ్చరిక మాట :**

బైబిలు బోధ యేమిటో తెలిసికొనకముందు ఒక హెచ్చరిక మాట చెప్పుకో వలసి యున్నది. పాపులందరు ఒకే కోవకు చెందిన వారు కారు. కొందరు పాపులు కరడుకట్టినవారై వారు మారు మనస్సుపొందలేనంత రీతిగా దేవునిపై తిరుగుబాటు చేయుదురు (హెబ్రీ 6:2-6). మరికొందరు తమపాపముల విషయమై ఒప్పింప చేయబడి వాటినుండి తొలగి పోదల చుదురు.

దిగువ కొన్ని లేఖన భాగము లున్నవి. కరడు గట్టిన పాపుల విషయమై అవి వాటికవే బోధించును : "నేను మీ ఉన్నత స్థలములను పాడు చేసెదను, మీ విగ్రహములను పడ

గొటెదను; మీ బొమ్మలపీనుగుల మీద మీ పీనుగులను పడవేయించెదను. నామనస్సు మీయందు అసహ్యపడును, నేను మీ పట్టణములను పాడు చేసెదను" (లేవీ 26:30-31).

"డాంబికులు నీ సన్నిధి నిలువ లేరు, పాపము చేయువారందరు అసహ్యులు" (కీర్తన 5:5).

"యెహోవా నీతిమంతులను పరిశీలించును, దుష్టులును బలాత్కారాసక్తులును ఆయనకు అసహ్యులు" (కీర్తన 11:5).

"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు, ఏడును ఆయనకు అసహ్యములు, అవేవనగా అహంకార దృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపు చేతులును దుర్యోచనలు యోచించు హృదయమును, కీడుచేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" (సామె 6:16-19).

సత్యము నంగీకరించని వారి యెడల దేవుని కోపమురగులుకొనును, అది ఎంత తీవ్రమైనదంటే, "దుర్నీతిని పుట్టించు సమస్తమోసముతోను నశించుచున్న వారిలో సాతానుకనుపరచు బలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతి యందు అభిలాష గలవారందరును శిక్షావిధిపొందుటకై అబద్ధమునునమ్మునట్లు మోసము చేయుశక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స2:10-12). సత్యమును నమ్మక అసత్యమునందు అభిలాషగలవారిని దేవుడు ప్రేమించుచున్న యెడల, శిక్షావిధిపొందునట్లు వారిని ఎందుకు అప్పగించును?.

**ద్వేషము ప్రేమ యిక లేదు :**

ఇశ్రాయేలీయులు ఎంత దుర్మార్గులయ్యారంటే దేవుడు వారిని ద్వేషించుటకారంభించారు (హోషేయ 5:11-9:15). "వారి చెడుతనమంతయు గిల్గాలులో కనబడుచున్నది; అచ్చటనే నేనువారికి విరోధినైతిని, వారి దుష్టక్రియలను బట్టి వారినికను ప్రేమింపక నామందిరములో నుండి వారిని వెలివేతును, వారి యధిపతులందరు తిరుగుబాటు చేయువారు" అని ఆయన చెప్పెను (హోషేయ 9:15). అవును పాపులైన ఇశ్రాయేలీయులను దేవుడు ప్రేమించారు, వారు మారుమనస్సు పొందవలెనని ఆయన కోరారు, గాని వారు తమ పాపములలోనే కొనసాగితే దేవుడు వారిని అసహ్యించుకొంటారు, ఎన్నటికీ వారిని ప్రేమింపరు.

మనమేమి చేసినా తిరుగుబాటు చేయుపాపులుందరినీ ఆయన ప్రేమిస్తారని ఆలోచించేబదులు, మనం ఆయనకు లోబడని యెడల ఆయన

ఎన్నడు ప్రేమింపరు సరిగదా మనలను అసహ్యించుకొంటారు. మనం దుర్నీతిలో జీవిస్తు యుంటే ఆయన ఉగ్రత మనపై కుమ్మరింపబడును (ప్రకట 14:10-11).

**ప్రేమ షరతులతో కూడినది :**

దేవుని ప్రేమ షరతులతో కూడినది, "దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండుడియని" యూదా వ్రాసాడు (యూదా :21). అంటే మనం దేవుని ప్రేమలో నిలిచియుండేటట్లు చూచుకొనాలి. దేవుని ప్రేమషరతులతో కూడి నట్టిదని యేసు చూపించారు. "నేనునా తండ్రి ఆజ్ఞలుగైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలుగైకొనిన యెడల నా ప్రేమయందు నిలిచియుందురు" అని ఆయన చెప్పారు (యోహాను 15:10). ఇంకోమాటలో మనం ఆజ్ఞలను గైకొంటే ఆయనప్రేమలో నిలిచి యుందుము. ఆయన ఆజ్ఞలనుగైకొనకపోతే మనం ఆయన ప్రేమలో యుండము.

**మారుమనస్సు పొందు లేదా నశించు :**

దేవుని వాక్యాన్ని బోధించువాడెవడైనా ప్రజలు మారుమనస్సు పొందునట్లు హెచ్చరించాలి. తద్వారా వారు ఆయన ఉగ్రతను తప్పించుకొందురు (మత్తయి 3:7-10; హెబ్రీ 10:25-28; 2 పేతురు 3:9). బోధకుడు ప్రజలను దేవుడు ప్రేమించుచున్నారని, వారు మారుమనస్సు పొందక పోతే ఆయన వారిని అసహ్యించుకొంటారని తప్పక హెచ్చరించాలి. వారు తమ తిరుగుబాటు తనమును విసర్జించి, యేసునందు విశ్వాసముంచి ఆయనకు విధేయత చూపితే దేవుడు వారిని ప్రేమిస్తారు. ఆయన ఉగ్రతనుండి వారు తప్పించుకొంటారు (యోహాను 3:36). దేవుడు మనలను ప్రేమించురీతిగా జీవించగలము!.

**గమనిక :**

**సత్యవాక్కు సాలు చందా మీరు ఇంకను పంపని యెడల వెంటనే పంపించండి. మీ బంధు మిత్రులు ఈ పత్రిక చదివేలాగున ప్రోత్సహించండి.**

**- ఎడిటర్**

www. satyavanicoc.com

# దేవుడు మరచిపోవును
## (God forgets)

అదినములైన తరువాత నేను వారితో చేయబోవు నిబంధన యిదే - నా ధర్మ విధులను వారి హృదయము నందుంచి వారి మనస్సు మీద వాటిని వ్రాయుదును. వారి పాపములను వారి అతిక్రమములను ఇకనుఎన్నటికి జ్ఞాపకము చేసికొనను అని ప్రభువు చెప్పుచున్నాడు" (హెబ్రీ 10:16-17).

దేవుడు సమస్తమును ఎరుగును. "మన ప్రభువుగొప్పవాడు ఆయన అధిక శక్తి గలవాడు. ఆయన జ్ఞానమునకు మితిలేదు" (కీర్తన 147:5). " ఆహా దేవుని బుద్ధిజ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము; ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు, ఆయన మార్గము లెంతో అగమ్యములు" (రోమా 11:33).

దేవుడు అంతము నుండి ఆదివరకు ఎరిగినవాడు (యెషయా 46:9,10). ఆయన నక్షత్రములన్నిటిని ఎరుగును, ప్రతి పక్షి యొక్క జాడను ఎరుగును (కీర్తన 147:4; మత్తయి 10:29). ఏ మానవుడు ఆయన పర్యవేక్షణనుండి తప్పించుకొన జాలడు (కీర్తన 33: 13,14; సామె 15:3). ఆయన మన తలవెంట్రుకల సంఖ్యను ఎరుగును (మత్తయి 10:33). మనకంటే మనసంగతిని ఆయన బాగుగా ఎరుగును. "దేవుడు మన హృదయము కంటె అధికుడై సమస్తమును ఎరిగి యున్నాడు" (1 యోహాను 3:20).

మనము చేయు ఏ చిన్న మంచి పనియైనను దేవుడు మరచిపోరు. "మీరు చేసిన కార్యమును, మీరు పరిశుద్ధులకు ఉపచారముచేసి యింకను ఉపచారము చేయుచుండుట చేత తన నామమును బట్టి చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాడు" (హెబ్రీ 6:10).

క్రైస్తవులను గూర్చి ఆయన చెప్పుచున్న ఈ మాటలను వినుట ఎంత ఆశ్చర్యమో! "వారి పాపములను, వారి అతిక్రమములను ఇకను ఎన్నడు జ్ఞాపకము చేసికొనను!" ఈ సత్యము ఎంత సింపుల్ అంటే పరిశుద్ధాత్ముడు ఈమాటలను పరిశుద్ధగ్రంథములో రెండు మార్లు లిఖించి యిచ్చారు (హెబ్రీ8 :12). కరుణా చిత్తుడైన దేవుడు మాత్రమే మన అపరాధము లను తన మనస్సునందుంచుకొన కుండ తీసి వేయగలడు.

దేవుడు సర్వజ్ఞాని గనుక మరచి పోవుటయనునది జ్ఞానసంబంధమైనది. మనం యేమి చేసామో ఆయన ఎరుగును. గాని మనం మారుమనస్సు నొందినప్పుడాపని జరిగినట్లే ఆయన

ఎంచడు, ఎంత ఆదరణయో! ఆయన ఆదరణనంగీకరిస్తే, ఆయన సవాలును కూడ అంగీకరించాలి, "ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4:32).

- డేనీ బాగ్స్

## పాపముకు విరుగుడు - యేసు క్రీస్తు
## (Answer to Sin, Jesus Christ)

పరిచయము :

- అందరును పాపము చేసారు
- దేవుని ఆజ్ఞను అతిక్రమించడం పాపం లేదా మేలైనదిచేయనెరిగియు ఆలాగు చేయక పోవడం పాపము.
- పాపము వినాశకరమైనది. అది మానవుని దేవుని నుండి వేరుచేయును అపవాదికి, మరణమునకు దాసత్వము చేయుటకు మనలను నడిపింతును.
- పాపములోబడి మరణించువారు నిత్యనరకములో నశింతురు (యోహాను 8:24; మత్తయి 25:41).

దిగువ లేఖనములను పఠించి జవాబీయుము :

1. హెబ్రీ 10:1-4

మోషేధర్మశాస్త్ర ప్రకారము అర్పింపబడే బలులు పాపములను తీసివేయలేకపోయెను. వారిని పరిపూర్ణులుగా చేయలేకపోయెను.

ఎడ్లయొక్కయు మేకలు యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము. అవునా?కాదా?

2. కొలస్స 1:19-20

తండ్రియైన దేవునితో యేసుక్రీస్తులో మాత్రమే సమాధానపడగలము.

అది యోహాను ద్వారా గాని, ఏదో ఒక మానవుని ద్వారా గాని సాధ్యమా ?

3. హెబ్రీ 2:17

నమ్మకము గల ప్రధాన యాజకుడెవరు ? యేసుక్రీస్తా ? లేక పోపా ? యేసుక్రీస్తు ప్రజల పాపములకు పరిహారము కలుగ జేయును, అవునా? కాదా ?

4. ఎఫెసీ 1:3-7

సమస్తాత్మీయాశీర్వాదములు క్రీస్తునందున్నవి. అవునా? క్రీస్తునందున్న

ఆత్మీయాశీర్వాదములలో మూడింటిని పేర్కొనుము.

5. 2 కొరింథీ 5:21
ఏపాపము ఎరుగని వాడెవరు? దావీదు, పోపు, క్రీస్తు. మన నిమిత్తము పాపమయిన వారెవరు?క్రీస్తు, మోషే.

6. హెబ్రీ 5:8-9
తాను పొందిన శ్రమలద్వారా ఎవరు విధేయత నేర్చుకొన్నారు? యేసుక్రీస్తు ఎవరికి నిత్యరక్షణకు కారకుడు?

7. యోహాను 8:32-34
మానవుని స్వతంత్రుని చేయునదేమి?
సత్యమనగా నేమి? యోహాను 17:17 చదువుము.

8. రోమా 6:16-18
రోమాలోని క్రైస్తవులు ఎవరికి/ దేనికి దాసులు ?
వారు దేనికి లోబడుటద్వారా స్వతంత్రులయ్యారు ?

9. 1 కొరింథీ 15:1-4
కొరింథీయులకు ఎవరు సువార్త చెప్పారు ?
సువార్తలో యున్న వాస్తవములు ఏమి ?

10. రోమా 6:3-7
ఒకడు క్రీస్తులో ఎట్లు ప్రవేశించును ?
యేసుక్రీస్తు ఎన్నోదినమున తిరిగి లేచెను ?

11. రోమా 6:23
పాపము వలన వచ్చు జీతము ..........
దేవుని కృపావరమేమిటి ?

12. 2 తిమోతి 1:10
మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను వెలుగులోనికి తెచ్చిన దెవరు ?

13. మత్తయి 7:21-23
పరలోక రాజ్యములో ఎవరు ప్రవేశింతురు?
అబద్ధబోధకులకు ఆనాడు ప్రభువు యేమి చెప్పును ?
నీవు యేసుక్రీస్తులో నీ పాపములు కడుగుకొంటివా ? -లోయ్ మిచ్చెల్

# నిన్ను నడిపించునది ప్రేమా ? లేక భయమా ?
## (Controled by Fear or Love ?)

మానవ సంబంధాలలో మిక్కిలి శక్తివంతమైనవి భయము, ప్రేమ అనునవి. భార్య భర్తలు ఒండొరుల ప్రేమను కాంక్షించుదురుగాని, వారిని గూర్చిన భయమును కాదు, తమ పిల్లలు భయము చేతగాక ప్రేమ వలన తమకు విధేయులై యుండాలని తల్లిదండ్రులు కోరుదురు. వయస్సు వచ్చిన వారు తమ మిత్రులు వారికి భయపడాలని గాక ప్రేమించాలని కోరుదురు.

ప్రేమలో సహించేగుణమున్నది, అది జీవితాన్ని పోషించి సంరక్షించును. అది సహించును, అభివృద్ధినొందును. భయము ఇట్టిదేమిచేయదు. మానవ సంబంధాలలో ప్రేమ నిర్మాణాత్మక మైనదై, లాభదాయకమగును. భయము కంటె ప్రేమ కోరదగును.

అయితే దైవ మానవ సంబంధాల సంగతి యేమిటి ? దేవుడు మానవుని ఎట్లు కంట్రోలు చేయును? ప్రేమ వలననా ? లేక భయము వలననా ?

దేవుడు ఇశ్రాయేలును ఒక జనాంగముగా చేసి వారిని పాలించు నిమిత్తము తరుచు భయమును వినియోగించారు. ఇశ్రాయేలీయులు ఆయనను ప్రేమించాలని ఆయన కోరుకొనెను (ద్వితీ 6:4,5). మరియు ఆయనను గూర్చి వారు భయపడునట్లు తగిన కారణమును కూడ వారికి చూపించెను.

మోషే వారిని నడిపించుటకారంభించినప్పుడు వారితో ఆయన వ్యక్తిగత సంబంధ మారంభమయ్యెను. ఆప్రజలతో ఆయనకు సన్నిహితసంబంధ మేర్పడుటకు పదితెగుళ్ళను వినియోగించెను (నిర్గమ 7-11 అధ్యా). ఆ తెగుళ్ళ ద్వారా ఆయన ఉనికి యొక్క యదార్థతను ఆయన వారి మధ్య స్థాపించెను. ఆయన సర్వశక్తి గల ఏకైక దేవుడని వారికి ఆయన నిరూపించెను. ఆయన వర్తమానము తిరుగులేనిది: "నేను సజీవుడనైన దేవుడను. సర్వశక్తిమంతుడను, నేను భీకరుడను, నా మీద తిరుగుబాటు చేయవద్దు".

ఇశ్రాయేలీయులు దేవునికి లోబడాలని ద్వితీయోపదేశకాండములో మోషే తెలియజేసాడు, వారి విధేయతకు ఆస్కారముగా అతడు భయాన్ని వినియోగించాడు, ఒక మనుష్యుని సోదరుడు గాని, కుమారుడు గాని, కుమార్తెగాని, భార్యగాని లేక మిత్రుడుగాని వ్యభిచరించుటకు ప్రోత్సహించినయెడల అట్టిసంగతి తెలియజేయబడవలెను మరియు అట్టివానిని చావగొట్ట

వలెను (ద్వితీ 13:6-11). దీని వలన ఇశ్రాయేలీయులు వ్యభిచరించుటకు భయ పడిరి.

న్యాయము తీర్చిన యాజకునిని గాని, న్యాయాధిపతిని గాని అగౌరపరచిన వాడు చంపబడవలెను (ద్వితీ 17:8-13). యిది వినిన ఇశ్రాయేలీయులందరు తీర్ప రిని అగౌరపరచుటకు భయపడుదురు.

అబద్ధసాక్ష్యము చెప్పినవాడు తన అబద్ధసాక్ష్యమును గూర్చి శిక్షననుభ వించవలెను (ద్వితీ 19:15-21). ఈ సంగతినెరిగిన ఇశ్రాయేలీయులందరు అబద్ధ సాక్ష్యమును గూర్చి భయపడుదురు.

మాటవిననొల్లని, తిరుగుబాటు చేయుకుమారుడు కలిగిన తలిదండ్రులు అతని మరణశిక్షకు పాత్రునిగా చేయవలెను (ద్వితీ 21:18-21). ఇందును బట్టి ఇశ్రాయేలీయులంతా భయపడేవారు.

ప్రాధమికంగా కంట్రోలు చేయ డానికి ధర్మశాస్త్రము వినియోగింపబడినది. సాధారణంగా దానికి భయపడుట వలన విధేయత సంభవించినది.

అదే సర్వశక్తి గల దేవుడు యేసుక్రీస్తు సిలువలో, పునరుత్థానములో తన్నుతాను బయలుపరచుకొన్నారు. ఈస్వీయ బయ ల్పాటులో భయం కాదుగాని ప్రేమ మనకు కనబడును. ఐగుప్తులో సంభవించిన తెగుళ్ల కంటే క్రీస్తు యొక్క సిలువ, పునరుత్థా నములు భయంకరమైనవి. తెగుళ్ల నాశనము గావించే శక్తిని బయలు పరచెను. సిలువ పునరుత్థానములు ప్రాణమును ధారపోస్తే శక్తిని బయలు పరచెను. తెగుళ్లద్వారా దేవుడు ఇశ్రాయేలీయు లను బానిసత్వము నుండి విడిపించెను. సిలువద్వారా దేవుడు మనలను పాపము నుండి విడిపించెను.

తెగుళ్లలో దేవుని ప్రేమ పనిచే యుచుండెను. అయితే ప్రజలయొక్క దుష్టత్వము, మూర్ఖత్వము వలన దేవుడు భయమును వినియోగించెను. అయితే ఆయన ఇకభయమును ఎన్నడు వినియో గించుటకు ఇష్టపడుటలేదు. క్రైస్తవ జీవితంలో కంట్రోలు చేసేశక్తి ప్రేమయే గాని భయముకాదు.

ధర్మశాస్త్రములో కంట్రోలు చేయుటకు భయము ఎట్లో సువార్తలలో దేవుని ప్రేమ అట్లు బయలుపరచ బడినది, ఆయన ప్రేమను బట్టి దేవుడు క్రీస్తును మన రక్షకునిగా పంపించారు. శిక్షించుటకు కాదు (యోహాను 8:16 -21). మనమింకను పాపులమై యుండగానే క్రీస్తును మన కొరకు బలియిచ్చి దేవుడు తన ప్రేమను ప్రకటించారు (రోమా 5:5-8). ఆయన ఒక్కడే అందరికొరకు మరణించారు గనుక క్రీస్తు ప్రేమవలన రక్షించే ఆయన కృప మనకు బయలు పరచ బడినది (2 థెస్స 2:16-17).

ఆశ్చర్యమేమంటే, ఆయనే మొదట మనలను ప్రేమించారు గనుక దేవుని మనం ప్రేమించుచున్నాము. మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీని వలన దేవుడు మన యందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను (1యోహాను 4:9-11).

ధర్మశాస్త్రము యొక్కయు సువార్తల యొక్కయు తారతమ్యము ఆశ్యర్యకరము. తప్పుచేయకుండుటకు భయపెట్టుట ధర్మశాస్త్రము యొక్క పని, దేవుని ఆశ్చర్య కరమైన ప్రేమకు ప్రజల నేత్రములను తెరచి ఆయనకు లోబడి సేవచేయునట్లు చేయుట సువార్త యొక్క పని.

తామెట్లు ఆదరించబడాలని క్రైస్తవులు కోరుకొందురో అట్లే ఇతరులను వారు ఆదరిస్తారు. వారు సహృదయులు, గౌరవనీయులు, యితరుల యెడల దయ కనికరము గలవారు. వారి యెడల ద్రోహము చేసిన వారిని క్షమింతురు. బీదలకు సహాయముచేతురు. తోటి క్రైస్తవు లకు వినయముతోపరిచర్య చేయుదురు. అనుదినము వారెందుకు ఇట్లు జీవిస్తారు? భయమువలనా? కానేకాదు ! వారు యేసుప్రభువును,ఆయనను పంపిన దేవుని ప్రేమించుట వలన అట్లు జీవిస్తారు. ప్రేమ వలన నడిపించబడువారు మాత్రమే అట్లు జీవించగలరు.

క్రీస్తు సిలువ, పునరుత్థాన ములలో దేవుడు నీకేమి చేసారో ఊహించుకోగలవా? క్షమాపణ యొక్క ప్రాముఖ్యతను నీవు అంచనా వేయ గలవా? దేవుని బిడ్డగా యుండే ఘనతను తలంచుకో గలవా? నీవు దేవుని, ఆయన కుమారుడైన క్రీస్తును నీకంటే ఎక్కువ ప్రేమించగలవా? క్రీస్తు యెడల నీకున్న ప్రేమను బట్టి నీతలంపులు, నీ ప్రవర్తన నడిపించ బడగలదా?

భయము నిన్ను దేవుని తట్టు త్రిప్పగలదు, గాని అది నిన్ను ఆయనతో బంధించలేదు. ప్రేమ మాత్రమే నీ హృదయాన్ని మనస్సు ను, జీవితాన్ని ఆయనతో బంధించ గలదు. నీవు ప్రేమ చేత నడిపించ బడగలవా?

- డేవిడ్ చాడ్వెల్

# రెండునిబంధనలు
## (The Two Covenants)

బైబిలులో రెండు ముఖ్య భాగము లున్నవి - పాతనిబంధన, క్రొత్తనిబంధన. నిబంధన యనగా ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఒడంబడిక. పాతనిబంధనలో దేవుడు తన ప్రజలతో పురాతన కాల మందు ఒక ఒడంబడిక చేసారు. క్రొత్త నిబంధన విషయంలో దేవుడు ఒక క్రొత్త ఒడంబడికను చేసి తన ఏకైక కుమారుని రక్తముతో దానికి ముద్రవేసెను.

హెబ్రీ పత్రిక లేఖకుడు మొదటి నిబంధన, రెండవ నిబంధనయని చెబుతు రెండవది మొదటి దానికంటే శ్రేష్టమైనదని చెబుతాడు. ఏలయనగా మేకల యొక్కయు, ఎడ్లయొక్కయు రక్తమును, మైలపడిన వారి మీద ఆవు దూడ బూడిదె చల్లుటయు, శరీరశుద్ధి కలుగునట్లు వారిని పరిశుద్ధ పరచిన యెడల నిత్యుడగు ఆత్మా ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించు కొనిన క్రీస్తు యొక్క రక్తము నిర్జీవక్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు మీ మన స్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధి చేయును. ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధ ముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున పిలువ బడిన వారు నిత్య స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానము పొందు నిమిత్తము ఆయన క్రొత్త నిబంధనను గూర్చిన వాగ్దానము పొందు నిమిత్తము ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు. మరణశాసనము ఎక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసిన వాని మరణ ము అవశ్యము. ఆశాసనము వ్రాసిన వాడు మరణము పొందితేనే అది చెల్లును. అది వ్రాసినవాడు జీవించు చుండగా అది ఎప్పుడైనా చెల్లునా? "(హెబ్రీ 9:13-17). ఈ లేఖనములను బట్టి మొదటి నిబంధన శ్రేష్టమైన మరి యొక నిబంధనతో మార్చబడెను. ఈ విషయంలో దాని వ్రాసిన వాని మరణ ము ఆవశ్యమాయెను. దానితో ఆయన దానికి ముద్రవేసి అమలులోనికి తెచ్చెను.

క్రీస్తు మొదటి నిబంధన కాలము లో జీవించెను దాని విషయమై ఆయన ఇట్లుచెప్పెను: "ధర్మశాస్త్రము నైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచ వద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:17, 18). తదుపరి ఆయన సిలువ మీద వ్రేలాడుచు, "సమాప్తమైనదని చెప్పి తల వంచి ఆత్మను అప్పగించెను" (యోహాను 19:30). యేమి సమాప్తమాయెను? మొదటినిబంధన, పాతధర్మశాస్త్రము

సమాప్తమాయెను! దీనిని మనం ఎరుగుదుము. ఏలయనగా ఆయనపునరుత్థానుడైన తరువాత తన శిష్యులతో ఇట్లు చెప్పెను. "మోషే ధర్మశాస్త్రములోను. ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని నేనే మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను"(లూకా 24:44).

క్రీస్తు పాతధర్మ శాస్త్రమును సిలువకు మేకులతో కొట్టివేసెనని అపొ. పౌలు కొలస్సయలోని క్రైస్తవులకు వివరించెను. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మన మీద ఋణముగాను, మనకు విరోధముగాను ఉండి పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాని మీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధ ములనన్నిటిని క్షమించెను" (కొలస్స 2: 14). సున్నతివిషయమై సంఘములో కొంత సమస్య ఉద్భవింపగా. అపొ. పేతురు లేచి యిట్లుచెప్పెను: "మన పితరులైనను మనమైనను మోయలేని కాడిని శిష్యుల మెడ మీద పెట్టి మీ రెందుకు శోధించుచున్నారు?'' (అపొ.కా. 15:10). యూదులు తామే మోయలేని ధర్మ శాస్త్రమును అన్యజనుల మీద ఎందుకు మోపుచున్నారు? అని పేతురు తెలిసికొనగోరెను. ధర్మశాస్త్రము పరిపూర్ణ తనుకోరెను. వారు దానిని గైకొనలేక పోయారు. అందు వలన అది ఎత్తివేయబడి క్రొత్తనిబంధన ఇయ్యబడెను. యిది కృపావాక్యము (యోహాను 1:17).

పౌలు యిచ్చిన సలహాను ప్రతివాడు పాటించుటకు ప్రయత్నించవలెను: "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా విభజించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమో 2:15). మనము వాక్యమును చదువవలెను, మనం చదివే వాక్యమును సరిగవిభజించవలెను. అనేకులు ఈ ప్రాముఖ్యాంశమును గమనించక యున్నారు. అందు వలన ఇంకా మోషేధర్మశాస్త్రమును పాటించగోరుచున్నారు. అదే సమయంలో ప్రభువును కూడ వెంబడించగోరుచున్నారు. అయితే మనం పాత ధర్మశాస్త్రమును వెంబడిస్తే కృపలోనుండి తొలగిపోయిన వారమని పౌలు చెప్పుచున్నాడు (గలతీ 5:4).

మనం బైబిలునంతా విశ్వాసించాలి. అయితే పాతనిబంధన ఇప్పుడు అమలులో లేదని కూడ గ్రహించాలి. గతంలో వారు పాపము చేసినట్లు మనం పాపము చేయకుండుటకు పాతనిబంధన మనకు బోధకలుగటకు వ్రాయబడి యున్నది (1కొరింథీ 10:6; రోమా 11:22). గనుక మనము సంపూర్ణనియమమైన క్రొత్తనింధనను మనం ఇప్పుడు అనుసరించాలి - ఇప్పుడు అమలులో యున్నది క్రొత్త నిబంధనయే.

-జె.సి.చోట్

# సంక్షిప్త వార్తలు

2015 మే నెల 26,27,28 తేదీలలో కాకినాడ మెక్లారిన్ హైస్కూలు యొక్క సువిశాలప్రాంగణలో తూర్పుగోదావరిజిల్లా క్రీస్తుసంఘస్థులు నిర్వహించిన యేసుక్రీస్తు రక్షణసువార్త సభలు అత్యంతఘనముగా దేవునికి మహిమ తెచ్చునదిగా నిర్వహించబడెను.బ్రదర్ మోజెస్‌కుమార్,ఎస్.ప్రభాకర్,పి.బలరాం మరియు ఈలి అబ్రహాం లింకన్ గార్లు నిర్విరామకృషి చేసి, అన్ని యేర్పాట్లు చేసి సభలను జయప్రదము చేసిరి.ఆ మూడు గొప్ప రాత్రులలోను ఇంచుమించు పదివేలవరకు సభలకు హాజరైనట్లు అంచనా;పలు ప్రాంతములనుండి వచ్చిన క్రీస్తు సంఘస్థులు,స్థానికులు మొదలగు వారితో ప్రాంగణమంతయు జన సమూహముతో కిట కిటలాడెను.సోదరులు కె.జి.కుమార్,టి.వి.సాంసన్‌రాజు,జాషువాగూటం,యమ్.సేమ్యేలురాజు,యమ్.సూర్యరావు, టి.ప్రసన్నవిజయకుమార్ గార్లు దైవగ్రంధము నుండి గొప్ప వాక్యసందేశములను అందించిరి.బ్రదర్ పి.విజయకుమార్,జ్ఞానసుధీర్‌గార్లు క్లుప్తప్రసంగములనందించిరి. మూడవదినమున మొదట్లో భారతదేశమందలి క్రీస్తుసంఘచరిత్రను జాషువాగూటం గారు క్లుప్తముగా వివరించిరి.ఆ మూడు దినములలోను సభలు అత్యంత క్రమశిక్షణతో, టైమ్‌ప్రకారముగాను జరిగెను.సభలకు హాజరైన యితరులు క్రీస్తుసంఘములలో యున్న క్రమశిక్షణను,సహవాసమును గమనించి ఆశ్చర్యచకితులైరి..గొప్ప పాఠములను నేర్చుకొనగల్గిరి.

2015 జూన్ 1,2,3 తేదీలలో అమలాపురంలో కరక్కాయపేటలో యున్న క్రీస్తుసంఘము నిర్వహించిన సువార్తాకూటములలో మూడవదినమున జాషువాగారు, ఎ.విశ్వేశ్వర రావు గార్లు వాక్యపరిచర్య చేసిరి. 8,9,10 తేదీలలో జాషువాగూటం దంపతులు చెన్నై వెళ్లిరి.

2015 జూన్ 17వ తేదీ బుధవారం కొత్తపేట మండలం వీధివారిలంకలో యున్న క్రీస్తుసంఘము పునర్నిర్మించుకొనిన ఆలయమును జాషువాగూటం గారు రిబ్బను కత్తిరించి,ప్రార్థనపూర్వకముగా ప్రతిష్టించిరి.ఆలయ నిర్మాణమునకు ప్రముఖ దాతలగు పల్లి సత్యనారాయణ(హైదరాబాదు),పల్లి సత్యరాజు(కాకినాడ)మరియు పల్లి కృపావరము గార్లను స్థానిక సంఘము ఘనముగా సత్కరించిరి.వీధివారిలంకలో సోదరులు కోనాల డేవిడ్‌రాజుగారు సత్యసువార్తచాటుటలో మంచి విజయము సాధించుచున్నారు.ఆరోజు జరిగిన కూటమునకు సోదరులు పి.జె.కృపాలిన్ గారు అధ్యక్షతవహించిరి.హాజరైన వరందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను.

2015 జూన్ 18వ తేదీనాడు బిక్కవోలు మండలం గండ్రేడులో నిర్మహించబడిన ఆలయమును జాషువాగూటం గారు ప్రభువు సేవకై ప్రతిష్ఠించిరి. ఆదినమున వర్షాభారమున్నను అనేకులు హాజరై ప్రభువువాక్యము నాలకించిరి. గండ్రేడులో పలు సంవత్సరములగా సోదరులు యస్.జాన్ గారు సువార్త చాటుచున్నారు.

2015 జూన్ 26వ తేదీనాడు రీక్కిగూటం దంపతులు,వారి కుమారుడు జస్టిన్ గారు రెండునెలలు అమెరికా పర్యటన ముగించుకొని కకినాడకు క్షేమముగా చేరుకొనొరి.అమెరికా దేశములో ఆయన పలురాష్ట్రములలో యున్న క్రీస్తుసంఘములను దర్శించి వారు విశ్వాసములోను,క్రీస్తుబోధనలోను నిలకడగా యుండవలెనని ప్రోత్సహించిరి. రోనీ గూటం దంపతులు ప్రస్తుతము అమెరికాలోను, రాబిన్ గూటం దంపతులు బెంగుళూరులోను యున్న సంగతి పాఠకులకు విదితమే.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004